క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

రణస్థలం: పెన్షనర్ల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రణస్థలం, లావేరు మండలాల పెన్షనర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పున్నాన నరసింహులు నాయుడు, ఎడ్ల పాపినాయుడు అన్నారు. రణస్థలంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ పెన్షనర్లకు సమస్యలు ఎదురైతే వెంటనే తమకు తెలియజేస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఫారం-16 కోసం పెన్షనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వేలిముద్ర కోసం ఎస్‌టీవో కార్యాలయానికి రావల్సిన అవసరం లేదని, సమీపంలో ఉన్న మీ సేవా కేంద్రాల్లోనూ సంప్రదించవచ్చని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణం కోసం స్థల సేకరణ, డీఏలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రణస్థలం ఎస్‌టీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సమతా రానాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ ప్రతినిధులు బాలి రామునాయుడు, మాడుగుల రామారావు, మన్నె కృష్ణానందం, మీసాల వెంకటరమణ, బవరి రమణ, వెంకటస్వామి, సీహెచ్ గోపాలరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు



వికసిత భారత్ సంకల్ప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం జి.సిగడాంలోని బలిజి కల్యాణ మండపంలో వికసిత భారత్ సంకల్ప్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు పైడి వేణుగోపాలరావు, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, మీసాల రామకృష్ణంనాయుడు, వజ్జిపత్తి రఘురాం, బూరాడ వెంకటరమణ, ముద్దాడ త్రినాథరావు పాల్గొన్నారు.

వెంకటస్వామికి జ్యోతిషాచార్య బిరుదు



వెంకటస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం: నగరానికి చెందిన మంత్రి వెంకటస్వామికి హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ జ్యోతిషాచార్య బిరుదుతో సత్కరించింది. ఈ నెల 16న ఆన్‌లైన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో వెంకటస్వామి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బిరుదుతో సత్కరించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



సాగు పద్ధతులను వివరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జి.సిగడాం : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మంగళవారం సంతవురిటి గ్రామంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాల ద్వారా వరి విత్తనాలు చల్లే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ సాగు ద్వారా ఆరుతడి పంటలను సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు డి.సూర్యనారాయణ, ఎ.రామ్‌సాయి, ఉదయ్, చందనాల గణపతి పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన ఎస్.జ్యోతిర్మయి అనే విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.20వేలను అమెరికాలో నివాసముంటున్న మనబాల వెంకట అనంత రవి దంపతులు ఆర్థిక సాయంగా అందించినట్లు మిమిక్రీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరపాలక సంస్థలో.. కీలక పోస్టులు ఖాళీ

- భర్తీకి చర్యలు తీసుకోని ప్రభుత్వం
- పౌర సేవల్లో తీవ్ర అంతరాయం



శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం

శ్రీకాకుళం: నగరపాలక సంస్థలోని కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలకు అందాల్సిన పలు సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అత్యంత కీలకమైన మున్సిపల్ ఇంజినీర్ పోస్టు సుమారు నాలుగు నెలలుగా భర్తీకి నోచుకోవడం లేదు. ఈ పోస్టులో పనిచేసిన దక్షిణామూర్తి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. తాజాగా ఆయన్ను విశాఖపట్నం బదిలీ చేశారు. ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. అలాగే, డీఈగా పనిచేస్తున్న కార్తీకను సైతం విశాఖపట్నం బదిలీ చేశారు. ఆ స్థానాన్ని సైతం భర్తీ చేయలేదు. టీపీఓ, టీపీఎస్ పోస్టులు కూడా కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు పోస్టులను భర్తీ చేసినప్పటికీ వారు ఇప్పటికీ విధుల్లో చేరలేదు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని తీసుకువచ్చే కీలక పోస్టులను ఇప్పటికైనా భర్తీ చేయకపోతే నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశముంటుంది. మరోవైపు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రభుత్వం విధించిన నిబంధనలతో పెన్‌డౌన్ పాటిస్తుండగా కార్యాలయపరంగా ప్లాన్లు అనుమతి పొందేందుకు కూడా వీలులేకుండా పోతోంది. టీపీఓ, టీపీఎస్‌లు లేకపోవడమే ఇందుకు కారణం. ఇంజినీర్లు లేకపోవడం వల్ల అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయి.

విధుల్లో చేరాల్సి ఉంది..



ప్రస్తుతం జరగనున్న పదోన్నతులు, బదిలీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని పోస్టులు భర్తీ అయ్యాయి. వారు విధుల్లో చేరాల్సి ఉంది. ప్రత్యామ్నాయ సిబ్బందితో ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

నగరవీధుల్లో అంధకారం..

నగరంలోని 70 శాతం వీధులు అంధకారంలో మగ్గుతున్నాయి. 33 రోజులుగా ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. సోమవారం సాయంత్రం వీధి దీపాలకు సంబంధించి అంతరాయం ఏర్పడగా దానిని సరిచేయడం తాత్కాలిక సిబ్బందికి సాధ్యపడలేదు. దీంతో రాత్రి 8 గంటల వరకు ప్రధాన వీధులు సైతం అంధకారంలో ఉన్నాయి. 8 గంటల తర్వాత కొన్ని వీధుల్లో వీధి దీపాలు సరిచేయగా, మరికొన్ని వీధులు మాత్రం అంధకారంలోనే ఉండిపోయాయి. ఈ సమస్య ఎప్పటికప్పుడు తలెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సోమవారం సాయంత్రం శ్రీకాకుళం సూర్యమహల్ కూడలి వద్ద వెలగని వీధిలైట్లు

కూటమి పాలనలో తిరోగమనంలో గ్రామాభివృద్ధి

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



పిషిణి గ్రామ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో గ్రామాలాభివృద్ధితో పాటు కుటుంబాల అభివృద్ధి తిరోగమనమై చతికిలపడ్డాయని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని పిషిణి పంచాయతీ నాయకులతో కూటమి ప్రభుత్వంలో జరిగే నష్టాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరడంతో గ్రామాలు కళకళలాడేవని, ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వలసబాట పడుతున్నారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పాల వెల్లువ కేంద్రాలు గత వైభవాన్ని కోల్పోయాయని తెలిపారు. తల్లికి వందనం డబ్బులు చాలామందికి అందలేదన్నారు. గ్రామాల్లో ఎక్కడికక్కడే అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ధ్వజమెత్తారు. కూటమి పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఇప్పటికే గ్రామస్థాయిలో కుటమి పరిపాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈ తరుణంలో గ్రామ సమస్యలపై ప్రజలకు అండగా నిలిస్తే మరలా మన ప్రభుత్వాన్ని తీసుకురాగలమని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సత్యం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకూర్మం గ్రామదేవత పండగ



అమ్మవారి జంగిడి ఊరేగింపు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో గ్రామదేవత మోహిని భద్రాంబికా గ్రామదేవత పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం దాసుడు ఇంటి వద్ద నుంచి అమ్మవారి జంగిడి బయలుదేరింది. కంద్రవీధి, బ్రాహ్మణవీధి, మెయిన్‌రోడ్డు, వెలమవీధి, సెగిడిపేటలో ఊరేగింపుగా వెళ్లగా భక్తులు కలశాలతో వెంట బయలుదేరారు. అనంతరం చల్లదనం చేశారు. రాత్రివరకు అమ్మవారి పూజలు కొనసాగాయి.

చారిత్రక ఆలయం.. వార్షికోత్సవాలకు సిద్ధం

- 19న ఉమాజఠలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం
- 200 ఏళ్లగా నిత్యం పూజలుందుకుంటున్న పరమేశ్వరుడు



అలంకరణలో ఉమాజఠలేశ్వరస్వామి



ఆనాటి పురాతన ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు. పురాణేతిహాసలకు సజీవ సాక్ష్యాలు. సజీవ శిల్ప సంపదతో హిందూ సంస్కృతి, విలువలకు అద్దం పడతాయి. అలాంటి దేవాలయమే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి ఆలయం. సుమారు రెండు వందల సంవత్సరాలుగా ఇక్కడి స్వామివారు నిత్యపూజలు అందుకుంటున్నారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది.

ఆలయ చరిత్ర..

నాగావళి నదికి అరమైలు దూరంలో శివనాగమయ్యపేట (ప్రస్తుతం నక్కవీధి)లో ఉమాజఠలేశ్వరస్వామి ఆలయం ఉంది. సుమారు 200 ఏళ్ల క్రితమే ఆలయాన్ని భస్మాంగుల వంశస్తులైన సంగయ్య నెలకొల్పారని స్థానికులు చెబుతున్నారు. నాటి నుంచి వారి వంశానికి చెందిన ప్రస్తుతం ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు భస్మాంగం అశ్వనీకుమార్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చారు. చిన్నగా ఉన్న ఈ ఆలయాన్ని 1999లో పునఃప్రతిష్ట చేశారు. ప్రధాన దేవాలయంతో పాటు ప్రాంగణంలో ఉపాలయాలుగా ఉమాదేవి, గణపతి, సంతోషిమాత, పంచముఖ ఆంజనేయడు, షిరిడిసాయి మందిరం, అయ్యప్పస్వామి, నవగ్రహ మండపం, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, ప్రత్యేకంగా శని దేవుని విగ్రహం కూడా వెలిశాయి. భక్తుల సహాయ సహకారాలతో ఇక్కడి ఆలయ గోపురాన్ని, ప్రధాన ముఖ ద్వారాన్ని, అర్ధ మండపాన్ని నిర్మాణం చేశారు. ప్రధాన అర్చకులతో పాటుగా సహాయ అర్చకులుగా శివ ఆదిత్య, మహేష్, ఈశ్వర సంతోష్, భాస్కర అవినాష్‌లు పూజలు చేస్తుంటారు. స్వామివారికి నిత్యపూజలు, అభిషేకాలతో పాటు మాస శివరాత్రి, కార్తీకమాసం, శివరాత్రి వేడుకలు, ఏటా వార్షికోత్సవం నిర్వహిస్తారు.



నేటి ఉమాజఠలేశ్వరుని ఆలయం

19న ఆలయ వార్షికోత్సవం..

నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి ఏడాది జేష్ఠ బహుళ అష్టమి రోజున వార్షికోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఈ నెల 19న వార్షికోత్సవం జరుగుతుంది. ఉదయం 108 కలశాలతో స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 6గంటలకు ఉమాజఠలేశ్వరస్వామివారికి కల్యాణం జరిపిస్తారు.

అంతా శుభాలే..



ఆలయంలో ఉన్న స్వామివారి విగ్రహం ఎంతో పురాతనమైనది. 1999లో పునఃప్రతిష్ట జరిగింది. భక్తుల సహకారంతో దేవాలయాన్ని అభివృద్ధి చేసి నిత్య కైంకర్యాలతో పూజలు నిర్వహిస్తున్నాం. స్వామిని దర్శించుకునే భక్తులకు అన్నీ శుభాలే కలుగుతాయి.

– బి.అశ్వనీకుమార్, వంశపారంపర్య ధర్మకర్త, ప్రధానార్చకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శ్రీకాకుళం రూరల్: జెమ్స్ క్యాంపస్‌లో..



శ్రీకాకుళం న్యూకాలనీ: బాలుర కళాశాల మైదానంలో..

యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం సాధ్యపడుతుందని వక్తలు పేర్కొన్నారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, రాగోలు జెమ్స్ కళాశాల ఆవరణలో యోగాసనాలు వేశారు. అధికారులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అరసవల్లి: ఆదిత్యుని సన్నిధిలో..

మూలకు చేరిన అంబులెన్సులు



శ్రీకాకుళం మండల పరిధిలోని వంశధార గెస్ట్‌హౌస్ వద్ద 108 అంబులెన్సులు పదుల సంఖ్యలో పడి ఉన్నాయి. కొన్ని ప్రమాదానికి గురైనవి, మరికొన్ని ఇంజిన్ సమస్యలు తలెత్తడంతో మూలకు చేరిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయమైనా సమకూరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం రూరల్

రోడ్డుపైకే మురుగునీరు



శ్రీకాకుళం నగరంలోని విశాఖ–బి కాలనీలో పలు వీధుల్లో రోడ్డుపైకే మురుగునీరు పారుతోంది. వాడుక నీరంతా రోడ్డుపైకి చేరడంతో ఈగలు, దోమలకు నిలయాలుగా మారాయి. మురుగునీటి మీదుగానే రాకపోకలు సాగించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

బారులు తీరిన లారీలు



ఎచ్చెర్ల మండల కేంద్రంలోని బాటిలింగ్ యూనిట్ వద్ద మద్యం లోడుతో వచ్చే లారీలు నిత్యం బారులు తీరుతున్నాయి. అన్‌లోడింగ్‌కు పది నుంచి పదిహేను రోజులు పడుతోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలకు స్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

–ఎచ్చెర్ల

గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



దాతలు సమకూర్చిన ఫ్యాన్లు అందజేస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండల పరిధిలోని శాస్త్రులపేట వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలురు గురుకుల పాఠశాలకు పలువురు దాతలు రూ.16 వేల విలువైన 11 ఫ్యాన్లను మంగళవారం వితరణ చేశారు. ఆ పాఠశాలలో చదువుతున్న రణస్థలం మండలం గోసాం గ్రామానికి చెందిన విద్యార్థి బాసి చాణిక్యరెడ్డి తండ్రి నాగరాజు విజ్ఞప్తి మేరకు ఆగ్రామ ఉద్యోగులు కంబపు శివరామకృష్ణ, కంబపు స్వప్న, కంబపు వెంకటరమణ, కంబపు గాంధీ, కాలపురెడ్డి వెంకటరమణ, బస మణికంఠ, శీరపు మణికంఠ, బాసి శ్రీనివాసరెడ్డి స్పందించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పి.ఎర్రయ్య, సభ్యులు రౌతు లక్ష్మణరెడ్డి, గళాల చిరంజీవి, యర్రార జయరాం, తోట చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు బదిలీ

జి.సిగడాం : స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక సాలూరు మోడల్ స్కూల్‌కు మంగళవారం బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మోడల్ స్కూల్ అభివృద్ధి, ఉత్తమ ఫలితాలు సాధించడంలో అన్నా శామ్యేల్ విశేష కృషి చేశారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం



ఎచ్చెర్లలో పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



లావేరులో పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎచ్చెర్ల: జగనన్న పాలనలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలు వద్దకే పాలనను తీసుకువెళ్లి గ్రామ స్వరాజ్యం తెచ్చారని.. చంద్రబాబు పాలనలో అడుగడునా మోసం, వంచనా, దౌర్జన్యాలే కనిపిస్తున్నాయని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఎచ్చెర్ల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సనపల నారాయణరావు, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం, జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ జరుగుళ్ల శంకరరావు, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల విప్ బగ్గు రాజారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు కోటిపాత్రుని శివ, ఇంటలెక్చువల్ అధ్యక్షుడు పైడి వెంకన్నగారి శ్రీను, మండల యువజన విభాగం అధ్యక్షుడు పంచిరెడ్డి రాంబాబు, మాడుగు జగదీష్, కోటిపాత్రుని హరికృష్ణ, పంచాది నర్సింహమూర్తి, తండ్యేల లక్ష్మణ్, శీరపు శ్రీరామూర్తి, కింతలి ఈశ్వరరావు, ఈశ్వరరావు, తిరుపతి, వరప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

- లావేరు మండల కేంద్రంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలన మోసపూరితంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పి ప్రజలను తిప్పలపాలు చేస్తోందన్నారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.